


## డిఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
సెప్టెంబర్ : 17 మంగళవారం సంపుటి : 28 సంచిక : 222

# గణేశ్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16) : పట్టణం లోని బొగ్గరపువారి వీధి గణేశ మండపంలో సోమవారం నిర్వహించిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా అన్నా రాంబాబు గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, బొగ్గరపు వారి వీధి యూత్ ,నాయకులు పాల్గొన్నారు.


# ట్రాఫిక్ క్లియరెన్స్ పై
## దృష్టి సారించిన పోలీసులు



అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగి పోయింది. రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. రోడ్ మీదకు మెట్లు రావడం, రోడ్డు మీదనే వాహనాలు నిలపడం,ఇంకా చెప్పాలంటే తోపుడు బండ్లు రోడ్డు పైనే నిలుపుతుండడం తో ట్రాఫిక్ సమస్య

2లో

# పొలం తగాదా..
## కర్రలతో విచక్షణా రహితంగా దాడులు



అగ్ని న్యూస్,పెద్దారవీడు: మండలం లోని రాజంపల్లి గ్రామంలో ఆదివారం భీకరమైన వాతావరణం నెలకొంది. పొలం విషయం లో ఇరువర్గాలకు చెందిన వారు గొడవ పడ్డారు. దీంతో ఒక వర్గం వారు, మరో వర్గంపై కర్రలతో విచక్షణా రహితంగా దాడులు చేయడం గమనార్హం. పొలం వద్దనే జరిగిన ఈ తతంగం చూస్తుంటే సినిమాల్లో ఫైటింగ్ సీన్ ను మరిపిస్తుంది. మహిళలపై కూడా కర్రలతో దాడులు చేయడం కనిపిస్తుంది.తల పగిలి చేత్తో తల పట్టుకుని పరుగు పెడుతున్నా వెంటాడి వేటాడి కొట్టడం ఆందోళన కలిగించే విషయం. ఓ వర్గీయులపై విచక్షణా రహితంగా

2లో

## మంత్రి సత్య కుమార్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు



అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16) : బీజేపీ జాతీయ నాయకులు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పుట్టినరోజు

2లో

## డిఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు

మొదటి పేజి తరువాయి

అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16): మార్కాపురం సబ్ డివిజన్ డియస్పీ గా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబు, గ్రామీణ ఎస్సై అంకమ్మరావు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.ముందుగ డిఎస్పీ నాగరాజు,శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విధుల్లో చేరారు. సీఐ, ఎస్ఐ లతో సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల విషయం పై చర్చించారు.

## ట్రాఫిక్ క్లియరెన్స్ పై దృష్టి సారించిన పోలీసులు

మొదటి పేజి తరువాయి

జఠిలంగా మారింది. తాజాగా మార్కాపురం పట్టణ ట్రాఫిక్ పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదు బాబు,ఇతర పోలీసులు సోమవారం పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి దుకాణాదారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వస్తువులను రహదారి పైకి ఉంచి విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ కు ఎవరు ఇబ్బందులు సృష్టించిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## పొలం తగాదా.. కర్రలతో విచక్షణా రహితంగా దాడులు

మొదటి పేజి తరువాయి

కర్రలతో దాడి చేసిన ఘటనలో ఆరుగురికిగాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు ఈ కేసును ఎలా డీల్ చేస్తారో చూడాలి మరి.

## మంత్రి సత్య కుమార్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

మొదటి పేజి తరువాయి

సందర్భంగా పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆయన పేరుతో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సత్య మంచి ఆరోగ్యం తో ప్రజా సంక్షేమ పాలకునిగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు శాసనాల సరోజిని, సీనియర్ నాయకులు పైడిమర్రి శ్రీనివాసరావు, జిల్లా సెక్రెటరీ చిన్నయ్య, బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మి, బిజెపి టౌన్ సెక్రటరీ రమేష్ మొదలగు వారు పాల్గొన్నారు.


# దేశద్రోహి రాహుల్ గాంధీ





### - రిజర్వేషన్ల వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ

### - బిజెపి ఓబీసీ స్టేట్ లీడర్ కోటపాటి

అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16) : విదేశాల్లో భారత్ పరువు తీస్తున్న రాహుల్ గాంధీ ని దేశ ద్రోహి గా అభివర్ణించాడు బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు కోటపాటి రాజా శ్రీకాంత్. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా పార్టీ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాజా శ్రీకాంత్ మాట్లాడుతూ ఇటీవల అమెరికా వెళ్ళిన రాహుల్ గాంధీ,మీడియాతో మాట్లాడుతూ భారత్ మరో సిరియా కాబోతుందని చెప్పడం చాలా బాధను కలిగించింది అని అన్నారు. మన దేశంలో ఉంటూ మన దేశంలో తింటూ పక్క దేశంలో మనదేశం ను తిట్టడం మన భారతదేశాన్ని కించపరిచేలా మాట్లాడడం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. మన దేశం ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా ఎదిగిన విషయం కండ్లకు కనిపించడం లేదు ఈ దేశ ద్రోహి రాహుల్ గాంధీకి అని అన్నారు. ఎప్పుడు భారతదేశం పై, మోడీ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారని ,అంతేకాకుండా మూర?ంగా బీసీ రిజర్వేషన్ రద్దు చేస్తామన్నారని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ పార్టీ వాళ్లకి మతి భ్రమించిందని ,ముందు నుంచి ఈ కాంగ్రెస్ పార్టీ కి బీసీలు అంటే చిన్న చూపే అని ఎద్దేవా చేశారు.నెహ్రూ బీసీలకు రిజర్వేషన్ వద్దు అన్నారు అని, ఇందిరాగాంధీ మండల్ కమిషన్ని మార్చురీకి పంపించిందని, రాజీవ్ గాంధీ తన పాదాల దగ్గర తొక్కి పట్టి ఉంచాడని కోటపాటి దుయ్యబట్టారు. 1993లో బీసీ రిజర్వేషన్ అమలులోకి రావడం జరిగింది ఇప్పుడు మళ్లీ రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ రద్దు చేస్తానని అనడం యావత్ భారతావని చూసిందని బీసీల తో పెట్టుకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా తుడిచిపెట్టుకొని పోతారు అని తెలియచేశాడు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ కన్వీనర్ కృష్ణారావు, జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజినీ, సీనియర్ నాయకులు పైడిమర్రి శ్రీనివాసరావు, బొంతల కృష్ణ ,చిన్నయ్య రమేష్ మద్దెల లక్ష్మి, ప్రవీణ్ ,శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మ జయంతి ని విజయవంతం చేద్దాం



అగ్ని న్యూస్,సింగరాయకొండ(సెప్టెంబర్ 16) : సృష్టి కర్త విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా లోని సింగరాయకొండ గ్రామం లో విశ్వకర్మ వారసులు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. నేడు నిర్వహించే విశ్వకర్మ ఉత్సవాన్ని విజయవంతం చెయ్యాలని సింగరాయకొండ విశ్వ బ్రాహ్మణ, విశ్వ కర్మ జయంతి ఉత్సవ నిర్వాహకులు కోరారు. సోమవారం ఈమేరకు నిర్వాహకులు పోలూరి ఏకాంబరాచారి,నూతక్కి వెంకట సాయి ఆచారి, నూతక్కి మహేష్ ఆచారి, చందలూరి శివాచారి, ఆదిమూలం శివా ఆచారి, హరి ఆచారి కార్యక్రమం గురించి వివరించారు. ముందుగా సింగరాయకొండ సాయిబాబా మందిరం వద్ద నుండి విశ్వకర్మ వారి ఉత్సవం ప్రారంభం అవుతుందని, ఉత్సవం లో ఖడ్గ దండకం, బిందె తీర్థం తో ఉత్సవం జరుగుతుందని భక్తులు, విశ్వబ్రాహ్మణ కుటుంబాలు, విశ్వ కర్మ వారసులు పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు. ప్రదర్శన అనంతరం సింగరాయకొండ ఆర్ టి సి బస్టాండ్ ఎదురుగా పాత టింబర్ డిపో వద్ద విశ్వకర్మ వారి కి అభిషేకం, హోమ, యాగ్నీక కార్యక్రమం, పూర్ణాహుతి జరుగుతాయని నిర్వాహకులు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# స్వంత నిధులతో చిల్ల కంప తొలగింపు





అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16) : మండలం లోని గొట్టిపడియ గ్రామ రహదారికి ఇరువైపులా చిల్ల కంప బాగా పెరిగి అల్లుకు పోయాయి. దీంతో వాహన దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 2 కి.మీ మేర చిల్ల కంప ప్రయాణీకులను ఇబ్బందులు పెడుతుంది. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు ఒంటెద్దు చిన్న రంగారెడ్డి, వాటిని తొలగించేందుకు ముందుకు వచ్చారు. తన స్వంత నిధులు రూ. 20 వేలు ఖర్చు చేసి చిల్లకంప తొలగించాడు. దీంతో గ్రామస్తులు రంగారెడ్డి చేపట్టిన పని కి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# గుంటూరు మిర్చియార్డు కు సోకిన అవినీతి వైరస్



## - రైతన్నల కష్టం పెద్దల జేబుల్లోకి

(అగ్ని న్యూస్,గుంటూరు)ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి యార్డు గా పేరున్న గుంటూరు మిర్చి యార్డును కొందరు నేతలు, ఆ పార్టీ విధేయ అధికారులు అవినీతి వైరస్‌లా పట్టి పీడిస్తున్నారు. మార్కెట్ సెస్, జీఎస్?టీ, 'జీరో', కటింగ్, బిల్ టు బిల్ రూపాల్లో యార్డు ఆదాయానికి రూ. 700 కోట్ల రూపాయలకు పైగా గండి కొట్టారు. అందులో అధికారులు, సిబ్బంది కలిసి రూ. 150 కోట్ల వరకు దండుకున్నట్లు విజిలెన్స్ విచారణలో వెలుగు చూసింది. క్వింటాకు రూ. 20 వేల చొప్పున కొనుగోలు చేస్తే బిల్లుల్లో మాత్రం 10వేల చొప్పున కొన్నట్లుగా చూపిస్తారు. దీని పేరే కటింగ్ ఇలా ఏడాదికి క్వింటాకు రూ.10 వేల చొప్పున ఐదేళ్లలో రూ. 50 కోట్లకు పైగా గండికొట్టారు. సహకరించిన యార్డు యంత్రాంగానికి బస్తాకు 4, వేమెన్లకు 6 రూపాయల చొప్పున వ్యాపారులు ముట్టజెప్పున్నారు. ఒకరి పేరుతో లైసెన్సు ఉంటే దానిపై మరొకరు లావాదేవీలు చేయడమే 'బిల్ టు బిల్' అందులోనూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు, వారికి వంత పాడిన అధికారులు ఈ అవినీతి వ్యవహారంలో నిండా మునిగినట్లు స్పష్టం అవుతోంది.

# జిల్లాలో 13 మంది ఎస్ఐ లకు స్థాన చలనం



అగ్ని న్యూస్,ఒంగోలు(సెప్టెంబర్ 16) : జిల్లాలో 13 మంది ఎస్ఐ లకు స్థాన చలనం జరిగింది. విఆర్ లో ఉన్న పలువురు ఎస్ఐ లకు స్టేషన్లు కేటాయించారు. మరికొందరిని విఆర్ కు పంపించారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి ఎస్ఐ గా టి.శ్రీరాం, హనుమంతుని పాడు ఎస్ఐ గా కె.మాధవరావు, పిసి పల్లి ఎస్ఐ గా కోటయ్య, పామూరు ఎస్ఐ గా కిషోర్ బాబు, సిఎస్ పురం ఎస్ఐ గా సుమన్,వెలిగండ్ల ఎస్ఐ గా మధుసూదన రావు, కొమరోలు ఎస్ఐ గా యం.వెంకటేశ్వర్లు నాయక్, కొనకనమిట్ల ఎస్ఐ గా టి.రాజ్ కుమార్, తర్లుపాడు ఎస్ఐ గా బ్రహ్మనాయుడు పుల్లలచెరువు ఎస్ఐ గా పి.రాజేష్ లను నియమించారు.కాగా త్యాగరాజు,శివ నాగరాజు,ప్రేమ్ కుమార్ లను జిల్లా విఆర్ కు పంపించారు.

# ప్రధాని మోదీకి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ ఏలూరి

(అగ్ని,విజయవాడ)

భారత ప్రధాని నరేంద్ర మోదీకి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ నాయకుడు డా. ఏలూరి రామచంద్రారెడ్డి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎల్లప్పుడూ అంకితభావంతో కృషి చేసే నాయకుడు మోదీ అన్నారు. ప్రజాసేవలో తరిస్తున్న ఆయన దీర్ఘాయుష్మడై, ఆరోగ్యవంతుడై జీవించాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానుఅంటూ పేర్కొన్నారు. మోదీ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన జీవిత వృత్తాంతం సరళమైన, సామాన్యమైన, అధ్యాత్మిక జీవనశైలికి నిలువెత్తు రూపం అన్నారు. అటువంటి నేత దేశ ప్రధానిగా ఉండటం భారత ప్రజలుచేసుకున్నఅదృష్టంగా భావిస్తున్నామన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది అంటే దానికి కారణం మోదీ అవలంబించిన విధానాలే అని గుర్తుచేశారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరితో ఆయన మెలిగే విధానం, స్పందించే గుణం.. ఇవన్నీ కూడా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా, విశ్వ గురువుగా నిలబెట్టాయన్నారు. అటువంటి గొప్ప నేత మళ్ళీ మళ్ళీ ప్రధాని కావాలని.. దేశం మరింత అభివృద్ధిని సాధించాలని కోరుకుంటున్నట్టు డాక్టర్ ఏలూరి తెలిపారు.



ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# కొమరోలు ఎస్సైగా వెంకటేశ్వర నాయక్



అగ్ని న్యూస్,కొమరోలు (సెప్టెంబర్ 16) : కొమరోలు నూతన ఎస్సైగా వెంకటేశ్వర నాయక్ ను నియమిస్తూ జిల్లా ఎస్పీ దామోదర్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. విఆర్ లో ఉన్న వెంకటేశ్వర నాయక్ ను కొమరోలు పోలీస్ స్టేషన్ కు జిల్లా ఎస్పీ బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్ రావు కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల కు బదిలీ అయ్యారు.ఒకటిరెండు రోజుల్లో ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ కొమరోలు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నారు. నాయక్ గతంలో మార్కాపురం రూరల్ ఎస్ఐ గా పని చేశారు.

# వరద బాధితులకు రూ. 2,16,000 విరాళం అందజేసిన టీడిపి నాయకులు



అగ్ని న్యూస్,కొనకనమిట్ల (సెప్టెంబర్ 16): విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనలతో కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, గరిమెనపెంట గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు విరాళాలు సేకరించారు. 2,16,000 రూపాయలను సోమవారం మండల పార్టీ అధ్యక్షులు మోరబోయిన బాబురావు కు, గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్, పరిటాల సుబ్బయ్య, ఎదుబాటి మల్లికార్జునలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి తిరుపతయ్య, వేముల శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న ఏడు మంది అరెస్టు



అగ్ని న్యూస్,పెద్ద దోర్నాల( సెప్టెంబర్ 16): మండలంలోని యడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడు మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వి.మహేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తుల వద్ద నుంచి 1650 రూపాయల నగదు సీజ్ చేసి, కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్సై వి. మహేష్ తెలిపారు.

# నిరుపేద ముస్లిం లకు కుటుంబాలకు మిఠాయిలు పంపిణీ చేసిన పోలీసులు



అగ్ని న్యూస్,కంభం (సెప్టెంబర్ 16): పట్టణంలోని అరాఫత్ నగర్ లో ఎస్ఐ నరసింహారావు మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిరుపేద ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు కంభం ఎస్ఐ నరసింహారావు అరాఫత్ నగర్ కు చేరుకొని పది మంది నిరుపేద కుటుంబాలకు స్వీట్ బాక్సులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిరుపేద ప్రజలు మాట్లాడుతూ పండుగ సందర్భంగా మమ్మల్ని గుర్తించి స్వీట్లు పంపించిన ఎస్పీ కి, అవి పంపిణీ చేసిన కంభం ఎస్ఐ నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# అన్నదానానికి 800 కిలోల బియ్యం ఇచ్చిన ఎమ్మెల్యే తాటిపర్తి




అగ్ని న్యూస్,యర్రగొండపాలెం(సెప్టెంబర్ 16): కొలుకుల సెంటర్లో ఏర్పాటు చేసినవరసిద్ధి వినాయక స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కోసం యర్రగొండపాలెంఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ 800 కిలోల బియ్యం సమర్పించారు.గణేష్ నిమజ్జనకార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆకాంక్షించారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం



అగ్ని న్యూస్,పెద్ద దోర్నాల (సెప్టెంబర్ 16): మండల కేంద్రం దోర్నాల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మైనారిటీ పరిరక్షణ హక్కుల సమితి అధ్యక్షులు పూల బాబు ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా  బాబు మాట్లాడుతూ నెలలో రెండు పర్యాయాలు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, ప్రభుత్వ వైద్యశాలలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు, రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా ఉచిత వైద్య శిబిరాలు, శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాలు నిరుపేదలైన వారికి నిత్యవసర వస్తువులు అందించటం, రక్తదానం నిర్వహించటం, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియా దోర్నాల లో పర్యటించిన సందర్భంగా నిరుపేదలైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశామని తెలియజేశారు. నిస్వార్థంగా కులమతాలకు అతీతంగా తమ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పూల బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పూల బాబు, షేక్ అబ్దుల్ కరీం ఉపాధ్యక్షులు, ఎస్.కె అల్లాబకాష్,సెక్రటరీ, ఎస్.కె మహబూబ్ బాషా సెక్రెటరీ, ఎస్కే వాజిత్, ఖజానా దారుడు, కార్యవర్గ సభ్యులు, ఎస్కే చికెన్ వలి, ఎస్కే సుభాని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ కనకదుర్గ పుట్టినరోజు వేడుకలు



అగ్ని న్యూస్,మార్కాపురం(సెప్టెంబర్ 16): శ్రావణి హాస్పిటల్ అధినేత్రి, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రావణి హాస్పిటల్ సిబ్బందితో పాటు మెడికల్ రిప్రజెంటివ్ లు కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పెద్దారవీడు మండలం దేవరాజు గట్టు సమీపంలోని శ్రీ కాశినాయన ఆశ్రమం నందు రెడ్డి సంక్షేమ సేవా సంఘం, ఆలయ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీర్వాదంఅందించి అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో డాక్టర్ కనకదుర్గతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గుంటక సుబ్బారెడ్డి తో పాటు కమిటీ సభ్యులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## గిద్దలూరు లో మంత్రి సత్య కుమార్ యాదవ్

# జన్మదిన వేడుకలు



అగ్ని న్యూస్, గిద్దలూరు (సెప్టెంబర్ 16): గిద్దలూరు దిగువమెట్ట చెంచు కాలనీలోభారతీయ జనతా పార్టీ గిద్దలూరు కో కన్వీనర్ గుమ్మా రాముడు యాదవ్ ఆధ్వర్యంలో ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి చిన్నారుల అందరికీస్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆకుమల్ల కోటేశ్వరరావు, దిగువమెట్ట చెంచుకాలనీ గూడెం పెద్ద లలితమ్మ పాల్గొన్నారు.



# అన్న వితరణ లో పాల్గొన్న టీడీపీ నాయకులు

అగ్ని న్యూస్,మార్కాపురం (సెప్టెంబర్ 16): పట్టణంలోని 13వ వార్డు పూల సుబ్బయ్య కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి ,వక్కలగడ్డ మల్లికార్జున రావు, తిప్పనబోయిన కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులకు, కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# పుల్లల చెరువు ఎస్ఐ గా పులి రాజేష్



అగ్ని న్యూస్, యర్రగొండపాలెం (సెప్టెంబర్ 16):పుల్లల చెరువు ఎస్సైగా పులి రాజేష్ ను, జిల్లా ఎస్పీ దామోదర్ నియమించారు. విఆర్ లో ఉన్న రాజేష్ ఒకటి రెండు రోజుల్లో ఎస్సైగా పుల్లల చెరువులో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈయన గతంలో పెద్దారవీడు, కంభం, అర్ధవీడు పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు.



# కార్యకర్తలకు అండగా జనసేన ఇంచార్జి గౌతమ్



అగ్ని న్యూస్, యర్రగొండపాలెం (సెప్టెంబర్16): గత కొన్ని రోజులుగా యాక్సిడెంట్ అయి అనారోగ్యంతో బాధపడుతున్న జనసేన కార్యకర్త జడ్డా వెంకటయ్య ఆరోగ్యం గురించి తెలుసుకున్న జనసేన పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ పాకనాటి గౌతంరాజు, ఆ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తదనంతరం ఆ కుటుంబానికి కావలసిన నిత్యవసర సరుకులు అందజేయించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీ కే చిన్న పాల్, జనసేన నాయకులు సందీప్, రాజు,యోహాను పాల్గొన్నారు.

# మంత్రి డోలా కు సమస్యల నీరాజనం



అగ్ని న్యూస్, ఒంగోలు (సెప్టెంబర్ 16): జిల్లాలో రైతుల సమస్యలపై, సాగునీరు త్రాగునీరు, పెండింగ్ ప్రాజెక్టులు, వెలుగొండ ప్రాజెక్ట్ సత్వర నిర్మాణం పూర్తి తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు సోమవారం మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మార్కాపురం కేంద్రంగా పశ్చిమ ప్రకాశం ప్రత్యేక జిల్లా ఏర్పాటు, మూతబడ్డ జిల్లా పాల కేంద్రం తిరిగి ప్రారంభించటం, పొదిలి మండలాన్ని వెలుగొండ ప్రాజెక్టు పరిధిలో కలపటం, పొదిలి పెద్ద చెరువు రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలపై రాష్ట్ర రైతు సంఘం నాయకులు చుండూరు రంగారావు సారథ్యంలో వివిధ రైతు సంఘాల నాయకులతో కలిసి మంత్రి ని కలిశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా, ఒంగోలు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు టీ. నాగలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోరంట్ల కోటేశ్వరరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కైపు వెంకటకృష్ణా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ లు కూడా మంత్రి ని కలిసిన వారిలో ఉన్నారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని రంగారావు తెలిపారు.










ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)